
MRR 69 TV


అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 92 | మంగళవారం 7 జూలై 2026 | పేజీలు : 4 | వెల : 3/-



కొత్తగా భూసమీకరణ పరిధిలోకి వచ్చిన

# రైతులకు రుణమాఫీ



**కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరిగే గ్రామాల రైతులకు శుభవార్త చెప్పిన ఏపీ ప్రభుత్వం**

**పదేళ్లపాటు ఏటా రూ.40 వేల కౌలు చెల్లింపునకు ఆమోదం**

**అమరావతిలో 25 అంతర్జాతీయ పాఠశాలల ఏర్పాటుకు సీఎం ఆదేశం**

**భూములు ఇవ్వని వారి నుంచి భూసేకరణకు చర్యలు**

**దేవాదాయ భూములకు రూ.159 కోట్లు చెల్లించాలని నిర్ణయం**

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి**

రాజధాని అమరావతి నిర్మాణంలో భూసమీకరణ రెండో దశలో కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరిగే గ్రామాల్లోని రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపికబురు అందించింది. భూసమీకరణ కింద భూములు ఇచ్చే ఆయా రైతులు ఈ ఏడాది జనవరి 6వ తేదీ వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేసేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) ఆమోదం తెలిపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన సీఆర్డీఏ 63వ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ వివరాలను పురపాలక శాఖ మంత్రి నారాయణ మీడియాకు వెల్లడించారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెప్పడానికి ఈ నిర్ణయమే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే మరిన్ని ముఖ్యమైన నిర్ణయాలకు కూడా ఈ సమావేశంలో ఆమోదముద్ర వేశారు. 2024 జూన్ నుంచి భూములు ఇచ్చిన రైతులకు పదేళ్లపాటు ఏటా రూ.40 వేలు కౌలుగా చెల్లించనున్నారు. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏటా రూ.10 వేల చొప్పున పదేళ్లపాటు చెల్లింపులు జరపాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాలతో భూములు ఇచ్చిన రైతులకు ఆర్థికంగా భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అమరావతి పరిధిలోని ఈనాం భూములకు సంబంధించి దేవాదాయ శాఖకు రూ.159 కోట్లు చెల్లించే ప్రతిపాదనకు కూడా సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. రాజధాని అభివృద్ధిలో భాగంగా అమరావతిలోని 25 టౌన్‌షిప్‌లలో ఒక్కో అంతర్జాతీయ పాఠశాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి - మిగతా 2లో

తిరుమలలోబ్రహ్మోత్సవాల నాటికి

## పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులు

**ఎలక్ట్రిక్ బస్సులపై రిలయన్స్ బృందంతో సమావేశంలో టీటీడీ అదనపు ఈవో**



**అంకుశం న్యూస్ తిరుమల జూలై 7**

రిలయన్స్ సంస్థ టీటీడీకి 25 ఎలక్ట్రిక్ బస్సులను విరాళంగా ఇస్తుండటంతో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు, పవర్ సప్లై, డ్రైవర్ల నిర్వహణ, వివిధ మౌలిక సదుపాయాల ఏర్పాటుపై రిలయన్స్ సంస్థ ప్రతినిధులతో తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిలయన్స్ సంస్థ విరాళంగా అందిస్తున్న ఎలక్ట్రిక్ - మిగతా 2లో

## అర్హులందరికీ ఇళ్లు

**గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి**



**(అంకుశం, అమరావతి, జూలై 7):**

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు అందించే లక్ష్యంతో ఈప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సమచార పౌర సంబంధాలు,గహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్ధసారధి స్పష్టం చేశారు.పేదలకు పక్కా గహాలు అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయడంతో పాటు కేంద్రం నుంచి అధిక నిధులు సాధించి వారి సొంత ఇంటి కల నిజం చేయడానికి శ్రాయశక్తులా కషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఏపి సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 2014--19 మధ్య మొత్తం 13,04,516 ఇళ్లు మంజూరు చేస్తే 10వేల 194 కోట్ల రూ.లు ఖర్చు చేసి 8,04,853 ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించిన ఘనత మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు.అందరికి ఇళు అందించాలన్న ఏకైక లక్ష్యంతో ఆనాడు రూ.10వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారని గుర్తుచేశారు.అంతేకాకుండా ఎస్సీ,ఎస్టీ, - మిగతా 2లో

## ఎల్--నినో సవాళ్లను ఎదుర్కొంటాం

**అన్ని శాఖలు హై అలర్ట్‌లో ఉండాలి**

**జిల్లా కలెక్టర్లు సన్నద్ధత, ప్రతిస్పందన చర్యలను పర్యవేక్షించాలి**

**హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత**



**(అంకుశం, అమరావతి, జూలై 7):**

ప్రస్తుతం నెలకొన్న ఎల్--నినో పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల కాలంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు ముందస్తు ప్రణాళికలతో పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కౌసర్ బానో, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో కలిసి నైరుతి రుతుపవనాల పరిస్థితులు, వర్షపాతం - మిగతా 2లో

## దేశంలో మొట్టమొదటి ఏఐ--ఆధారిత పర్యాటక రాష్ట్రంగా ఏపీ

**పర్యాటక అభివృద్ధి సంస్థ, ఎక్స్‌ప్లర్జర్ మధ్య ఒప్పందం**

**రాష్ట్రంలోని 100 పర్యాటక ప్రాంతాల్లో 'నివు ఏఐ' సేవలు**

**మంగళగిరిలో పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం**

**పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్**

**(అంకుశం, అమరావతి, జూలై 7):**

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పర్యాటక శాఖ చారిత్రాత్మక అడుగు వేసిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్ లో ప్రముఖ ట్రావెల్ సంస్థ 'ఎక్స్‌ప్లర్జర్' రూపొందించిన 'నివు ఏఐ' ప్లాట్‌ఫారమ్ వినియోగానికి ఏపీ పర్యాటక అథారిటీ మూడేళ్ల వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఏపీటీఏ ఎండీ అమ్రపాలి - మిగతా 2లో



## విజయవాడ నుంచి వారణాసి, కోల్‌కతాకు విమానం

**ఆగష్టు 13 నుండి సర్వీసులు ప్రారంభం**

**పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కందుల దుర్గేష్**

**(అంకుశం, విజయవాడ, జూలై 7):**

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రయాణికులకు ఇండిగో ఎయిర్‌లైన్స్ సరికొత్త శుభవార్త అందించింది. ఆగస్టు 13, 2026 నుండి విజయవాడను ఆధ్యాత్మిక నగరమైన - మిగతా 2లో



# ఉరవకొండ నియోజకవర్గం ఏపీడబ్ల్యూజేఎఫ్ కమిటీ ఏకగ్రీవం

**అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రేగటి భీమప్ప,పీవై సుంకన్న గౌరవ అధ్యక్షులుగా మాలపాటి శ్రీనివాసులు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పులివారి హరిప్రసాద్**



**అంకుశం న్యూస్ ఉరవకొండ జూలై 7 :** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్( ఏపీడబ్ల్యూజేఎఫ్ ) ఉరవకొండ నియోజకవర్గం కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆర్. భీమప్ప ( ఏపీ టుడే ), పీవై సుంకన్న( సాక్షి)లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.అలాగే నియోజకవర్గం గౌరవ అధ్యక్షులుగా మాలపాటి శ్రీనివాసులు,రాష్ట్ర కమిటీ సభ్యులుగా పులివారి హరిప్రసాద్ లు ఎన్నికయ్యారు. మంగళవారం ఉరవకొండ పట్టణంలోని లయన్స్ క్లబ్ సమావేశ భవనంలో ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల విలేకరుల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్( ఏపీడబ్ల్యూజేఎఫ్ ) అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు ( ఐ న్యూస్ బ్యూరో), ఏపీడబ్ల్యూజేఎఫ్ సీనియర్ నాయకులు డాక్టర్ సూర్య ( 6 టీవీ బ్యూరో) హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికలలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉరవకొండ నియోజకవర్గం అధ్యక్షులుగా ఆర్. భీమప్ప, ఉపాధ్యక్షులుగా సాల్మన్ రాజ్ ( ప్రజాశక్తి ), వీరేష్ ( సాక్షి రూరల్), జీటీ పాల్ ( జనసూర్య శ్రీ), ప్రధాన కార్యదర్శిగా పీవై సుంకన్న ( సాక్షి ), కార్యదర్శులుగా సీహెచ్ ఓబులేసు ( వెటరన్ జర్నలిస్టు), బలరాం ( ఆర్ టీవీ ), మధుబాబు ( 7 ఎస్టీవీ ), కోశాధికారిగా మొహియుద్దీన్ ( బిగ్ టీవీ ), కార్యవర్గ సభ్యులుగా బాలచంద్ర ( జ్యోతి ), రాజేష్ ( జనసూర్య శ్రీ), రంగస్వామి ( సాక్షి ), కార్తీక్ ( వార్తా బలం ), నాగభూషణం ( నవ భూమి ), శ్యామ్ కిరణ్ ( వైఎస్ఆర్ టీవీ ), సంజప్ప ( ప్రజా సంక్షేమం మాస పత్రిక ), శివ ( సూర్య ), అఖిల్ ( గోదావరి డైలీ ), బి. రమేష్ ( లేపాక్షి టైమ్స్), బి. ఉమాపతి ( 6 టీవీ ) తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా మాలపాటి శ్రీనివాసులు ( జన ప్రగతి ), ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పులివారి హరిప్రసాద్ ( అసోసియేట్ ఎడిటర్, ధర్మవిజేత ) లను ఎన్నుకున్నారు.ఈ సమావేశానికి ఉరవకొండ,వజ్రకరూరు,విడపనకల్లు,బెలుగుప్ప,కూడేరు మండలాలకు చెందిన పాత్రికేయులు హాజరయ్యారు.

## విజయవాడ నుంచి వారణాసి, కోల్‌కతాకు విమానం

-మొదటిపేజీ తరువాయి

వారణాసి, మరియు చారిత్రక నగరమైన కోల్‌కతాతో అనుసంధానిస్తూ విజయవాడ నుండి కొత్త విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు ఇండిగో సేల్స్ ప్రతినిధులు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయవాడ నుండి వారణాసి, కోల్‌కతా నగరాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభం కావడం పట్ల మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సర్వీసులు ప్రయాణికులకు ఎంతో సమయాన్ని ఆదా చేయడమే కాకుండా, పర్యాటక, వ్యాపార రంగాల అభివద్ధికి ఎంతగానో దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.వారంలో నిర్ణీత రోజులలో (మంగళ, గురు, శనివారాల్లో) సర్వీసులు అందుబాటులో ఉంటాయని ఇండిగో ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ సేల్స్ మేనేజర్ మోహిత్ కృష్ణ, విజయవాడ అసిస్టెంట్ మేనేజర్ (ఆపరేషన్స్) సుభాని పాల్గొన్నారు.

## ఎల్--నినో సవాళ్లను ఎదుర్కొంటాం




-మొదటిపేజీ తరువాయి

లోటు, కరవు ప్రభావం, విపత్తు నిర్వహణ చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 'జీరో లాస్' లక్ష్యంతో పనిచేస్తోందని, ఏ ఒక్క ప్రాణనష్టం కూడా సంభవించకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. విపత్తులు సంభవించిన తరువాత స్పందించడం కంటే, వాతావరణ అంచనాల ఆధారంగా ముందుగానే చర్యలు చేపట్టడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ప్రత్యేక అధికారులతో 24 గంటలూ కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చూడాలని సూచించారు. జిల్లా యంత్రాంగం, పోలీసు, రెవెన్యూ, ఫైర్ సర్వీసులు, జలవనరులు, ఆరోగ్యం, విద్యుత్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు సహా అన్ని శాఖలు నిరంతర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. జలవనరుల శాఖ రిజర్వాయర్లు, నదుల నీటిమట్టాలను 24 గంటలూ పర్యవేక్షించాలని, బలహీనమైన గండ్లు, కరకట్టలు బలోపేతం చేయాలని, దిగువ ప్రాంతాలకు ముందుగానే వరద హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశం ముగింపులో మంత్రి మాట్లాడుతూ నైరుతి రుతుపవనాల కాలం ముగిసే వరకు ప్రతి శాఖ హై అలర్ట్‌గా ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు సన్నద్ధత, ప్రతిస్పందన చర్యలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని, ప్రజల ప్రాణాలు, జీవనోపాధి రక్షణతో పాటు అత్యవసర సేవలను వేగంగా పునరుద్ధరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్, పురపాలక -- పట్టణ అభివద్ధి శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్, బెటాలియన్ కమాండంట్ ప్రసన్న కుమార్, ఐజి రాజకుమారి,డైరెక్టర్ ఫైర్ సర్వీసేస్ మురళీ మోహన్, ఏపిఎస్డీఎంఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కౌసర్ బానో, ఏవో రవి కుమార్, సిబివో రామాయణపు తనూజ తో పాటు పలు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పొగాకు వేలం కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

**-- ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**(అంకుశం, అమరావతి, జూలై 7):** వర్జీనియా పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సామాజిక సంక్షేమ, విద్యుత్, రెవెన్యూ శాఖల మంత్రులతో పాటు టొబాకో బోర్డు చైర్మన్, టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆక్షన్ ప్లాట్‌ఫార్మ్‌ల పరిస్థితి, కొనుగోళ్ల పురోగతి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి సమగ్రంగా చర్చించారు. ఈ నెల 9న టొబాకో బోర్డు కేంద్ర సంయుక్త కార్యదర్శి ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న నేపథ్యంలో రైతులు, పొగాకు కొనుగోలు సంస్థల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అధిక రిజెక్షన్ నమోదవుతున్న ఆక్షన్ ప్లాట్‌ఫార్మ్‌లపై ప్రత్యేక దష్టి సారించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. పొగాకు వేలం కేంద్రాలను సంబంధిత సహచర మంత్రులు స్వయంగా సందర్శించి రైతులతో మాట్లాడాలని, కంపెనీల సిండికేట్ వ్యవహారాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఆక్షన్‌లలో పాల్గొనకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కంపెనీలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డు అధికారులను మంత్రి ఆదేశించారు. రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా, వర్జీనియా పొగాకుకు న్యాయమైన ధరలు లభించే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## కొత్తగా భూసమీకరణ పరిధిలోకి వచ్చిన రైతులకు రుణమాఫీ

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మరోవైపు, భూసమీకరణకు స్వచ్ఛందంగా ముందుకు రాని వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం రాత్రిలోగా భూములు ఇవ్వని వారి నుంచి మరుసటి రోజు నుంచే భూసేకరణ ప్రక్రియ ప్రారంభిస్తామని మంత్రి నారాయణ హెచ్చరించారు. ఇప్పటికే కొన్నిచోట్ల 2.5 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్లు అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఒకవైపు రైతులకు భరోసా కల్పిస్తూనే, మరోవైపు అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు దోహదపడతాయని భావిస్తున్నారు.

## తిరుమలలోబ్రహ్మోత్సవాల నాటికి పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులు

-మొదటిపేజీ తరువాయి

బస్సులను భక్తులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలన్నారు. బ్రహ్మోత్సవాల నాటికి పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం టీటీడీ నడుపుతున్న 15 బస్సులతో పాటు అదనంగా మరో పది బస్సుల కోసం మొత్తం 50 బస్సుల సామర్థ్యంతో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి ఒకేసారి 20 బస్సులు ఛార్జింగ్ అయ్యేలా 10 ఛార్జింగ్ పాయింట్లను అందుబాటులో ఉంచాలని రిలయన్స్ బృందాన్ని కోరారు. 10ఇ30 చదరపు అడుగుల వైశాల్యం కలిగిన ఒక్కో బస్సులో 50 మంది సురక్షితంగా ప్రయాణించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

బస్సులు త్వరగా ఛార్జింగ్ అయ్యేందుకు వీలుగా 2 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. బస్సులను నడిపేందుకు 50 మంది నిపుణులైన డ్రైవర్లను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రెండు నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉండేలా ఒక షిఫ్టుకు 25 బస్సుల లెక్కన రెండు షిఫ్టుల్లో 50 బస్సులు తిప్పేలా చర్యలు చేపట్టాలని చెప్పారు.

బస్సుల పార్కింగ్ కోసం తగిన స్థలాన్ని గుర్తించి రిలయన్స్ సంస్థ ప్రతినిధులతో చర్చించి త్వరితగతిన పూర్తిస్థాయి ఛార్జింగ్ స్టేషన్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా బస్సులో అధునాతన ప్రయాణికుల సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి రాబోయే బస్టాప్ ల వివరాలు భక్తులకు తెలిసేలా చర్యలు చేపట్టాలని చేపట్టాలని చెప్పారు.

ఈ సమావేశంలో టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ వేంకటేశ్వర్లు, ఐటీ జీఎం వేంకటేష్ నాయుడు, ఎలక్ట్రికల్ డీఈ చంద్ర శేఖర్, ట్రాన్స్ పోర్ట్ డీఎం శ్రీమతి లక్ష్మీ ప్రసన్న, రిలయన్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్ గణేసన్, సీనీయర్ జనరల్ మేనేజర్లు రాఘవేంద్ర, వినోద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దేశంలో మొట్టమొదటి ఏఐ-- ఆధారిత పర్యాటక రాష్ట్రంగా ఏపీ

-మొదటిపేజీ తరువాయి

కాట, ఏపీటీఏ సీఈఓ ఏఏఎల్ పద్మావతి ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో మంత్రి కందుల దుర్గేష్ సంబంధిత అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు. ఈ కీలక ఒప్పందం ద్వారా రాష్ట్రంలోని 100కు పైగా ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలలో పర్యాటకులకు బహుభాషా ఏఐ సహాయాన్ని అందించనుందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. పనితీరు బాగుంటే కాలపరిమితిని పొడిగించే అవకాశమున్నట్లు తెలిపారు. మొదటి ఏడాదిలో 30 ప్రధాన ప్రాంతాల్లో, మూడేళ్లలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ప్రకారం పర్యాటకులు రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని కోటలు, బీచ్‌లు, చారిత్రక కట్టడాలు మరియు దేవాలయాల వద్ద ఏర్పాటు చేసే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా 'నివు ఏఐ'తో నేరుగా సంభాషించవచ్చని వివరించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాలలో పైలట్ ప్రాజెక్ట్‌ను విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రతిరోజూ వందలాది మంది భక్తులు ఈ ఏఐ సేవలను ఉపయోగించుకుంటూ, తమకు నచ్చిన భాషల్లో ఆలయ విశిష్టతను, పూజా విధానాలను తెలుసుకుని అద్భుతమైన స్పందన అందించారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఏపీటీఏ సీఈఓ ఏఏఎల్ పద్మావతి, ఎక్స్‌ప్లర్జర్ వ్యవస్థాపకుడు -- చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జితిన్ భాటియా పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇళ్లు

-మొదటిపేజీ తరువాయి

బీసీలు ఇళ్ల నిర్మాణంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ. 712.83 కోట్లు అదనపు ఆర్థిక సాయం అందించారన్నారు.ఎస్సీ, ఎస్టీలకు ఇంటికి రూ.50వేల చొప్పున, ఆదివాసి గిరిజనులకు ఇంటికి రూ.75వేల చొప్పున అందించి వారికి చేయుత నివ్వడం జరిగిందని మంత్రి పార్థసారధి పేర్కొన్నారు. 2024 తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పక్కాగహాల నిర్మాణాలను వేగవంతం చేసిందని మంత్రి పార్థసారధి చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి కేంద్రానికి పంపించి మంజూరు చేయించుకోవడం జరిగిందని అన్నారు.ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకంలో భాగంగా 57,600 గహాలు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకంలో భాగంగా 684 ఇళ్లు, పీఎం--జనమన్ క్రింద 28,430 ఇళ్లు మొత్తం 86,714 ఇళ్లు మంజూరయ్యాయని హర్షం వ్యక్తం చేశారు.ఈప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు పిఎంఏవై అర్బన్,గ్రామీణ మరియు పియం జన్ మన్ పథకాల కింద 2వేల 102 కోట్ల రూ.లు ఖర్చు చేసి 4లక్షల 56వేల 536 ఇళ్ళను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.పక్కా గహాల నిర్మాణం కోసం అర్హులైన లబ్ధిదారుల నుండి ప్రభుత్వం దరఖాస్తులు కోరగా దాదాపు 10,42,199 దరఖాస్తులు అందాయన్నారు.స్క్రూటినీ అనంతరం నిబంధనల మేరకు 9.50 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించడం జరిగిందన్నారు.వీటిలో మొదటి విడతగా కేంద్రం 74,812 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు.భవిష్యత్తులో అర్హుల సంఖ్యను బట్టి కేంద్రం నుండి పెద్ద సంఖ్యలో ఇళ్లను మంజూరు చేయిస్తామని హామి ఇచ్చారు.

## అంకాళమ్మ తిరునాళ్ల లో పాల్గొన్న బైరెడ్డి, దారపనేని



**కనిగిరి జూలై 7 అంకుశం న్యూస్** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం చిలంకూరు గ్రామంలో వెలసి ఉన్న అంకాళమ్మ తిరునాళ్లు గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ తిరునాళ్ల లో భాగంగా మంగళవారం యరశింగ్ వారి అంకాలమ్మ గ్రామోత్సవం లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి లు పాల్గొని అంకాళమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిలంకూరు మాజీ సర్పంచ్ యరశింగ్ ముసలయ్య, యరశింగ్ వెంకటేశ్వర్లు, యరశింగ్ ప్రసాద్, యరశింగ్ నారాయణ, అల్లు శ్రీనివాసులు, యరశింగ్ శ్రీనివాసులు, గొడుగులూరి వెంకటేశ్వర్లు, యరశింగ్ రాజేంద్ర, యరశింగ్ రాంబాబు, గుంటుపల్లి నాగేశ్వరరావు, పారా వెంకటేశ్వర్లు తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మొక్కలను పెంచి భావి తరాలకు నాంది పలకండి.. సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేశ్వర్లు.



**అంకుశం న్యూస్ ధర్మవరం జూలై 7** మొక్కలను పెంచి భవిష్యత్ తరాలకు నాంది పలకాలని సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జ్ నందిని, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ వెంకట హరీష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పర్యావరణ పరిరక్షణలో భాగంగా కోర్టు ఆవరణములో వనమోత్సవములో భాగంగా మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ నేతృత్వంలో జడ్జీలు అందరూ కూడా మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటి వద్ద పరిసరాలలో మొక్కల పెంపకాలను చేపట్టి, వాటి పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడాలిఏ అంటే మొక్కలు నాటడమే ప్రధాన ధ్యేయము అని వారు తెలిపారు. మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు. చెట్లు పెంచడం వల్ల కాలుష్య నివారణ జరిగి ప్రజలంతా ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు డిఎల్ఎన్ మూర్తి ,బాబా, రంగరాజ బట్టర్, రామాంజనేయులు, నరేంద్ర ,ప్రసాద్, సుబ్బరాయుడు ,కోర్టు సిబ్బంది కూడా పాల్గొని వారు కూడా మొక్కలు నాటారు.

## ఉచిత సంతాన సాఫల్య అవగాహన శిబిరమును సద్వినియోగం చేసుకోండి.. డాక్టర్ శ్రీ మతి ఎస్.పద్మ.




**అంకుశం న్యూస్ ధర్మవరం జూలై 7** పట్టణంలోని ఎర్రగుంట రోడ్, పార్థసారథి నగర్లో గల దేవి నర్సింగ్ హోమ్ లో జులై 8 వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత సంతాన సాఫల్య అవగాహన శిబిరమును నిర్వహిస్తున్నట్లు దేవీ నర్సింగ్ హోమ్ అధినేత్రి డాక్టర్ పద్మా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు పుట్టకపోవడం అనేది చికిత్స చేయదగిన మరొక వైద్య స్థితి అని తెలిపారు. పి సి ఓ ఎస్ సమస్యలు ఫాలోపియన్ ట్యూబ్ పోవడం, సంతానము కలుగుటలో పలు సమస్యలు లాంటి వాటికి పరిష్కారంతో పాటు చక్కటి వైద్య చికిత్సలు కూడా అందిస్తామని తెలిపారు. కావున సంతానం లేని దంపతులు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సెల్ నెంబర్ 8105 073250కు గాని 99 12031139 కు గాని సంప్రదించాలని తెలిపారు.

## శ్రీ చైతన్య పైన చర్యలు ఎక్కడ





**అంకుశం న్యూస్, అనంతపురం,జూలై : 7** శ్రీ చైతన్య విద్యా సంస్థలు నిబంధనలకు వ్యతిరేకంగా పాల్పడుతుంటే ఎందుకు ఆ విద్యాసంస్థ పై చర్యలు తీసుకోలేదని విద్యార్థి సంఘాల జేఏసీ నేతలు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రశ్నించారు. విద్యార్థి నేతలు మంగళవారం రుద్రం పేట వద్ద బిల్డింగ్ పూర్తి కాకుండా స్కూల్ నడుపుతున్న శ్రీ చైతన్య స్కూల్ వద్ద రెండో రోజు ధర్నా నిర్వహించగా... విద్యాశాఖ అధికారి స్పందించకపోవడంతో జిల్లా విద్యాశాఖ అధికారి లేకపోవడంతో అక్కడ ఉన్న ఏడి మునీర్ ఖాన్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ మాట్లాడుతూ దాదాపు మూడు గంటల పాటు శ్రీ చైతన్య విద్యాసంస్థలకు ఎటువంటి గుర్తింపు లేదని అలాంటి విద్యా సంస్థలు కూడా చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తే, విద్యాశాఖ అధికారులు తమ ఫోన్ చేస్తే సార్ ఇక్కడ బిల్డింగ్ కనెక్షన్ జరుగుతుంది, బిల్డింగ్ పనులు జరుగుతుంటే మరోపక్క తరగతులు ఎలా నిర్వహిస్తారని ఫిర్యాదు ఎందుకు స్పందించలేదని అధికారులు ప్రశ్నించారు. లక్షలక్షల ఫీజులు వసూలు చేస్తూ ఎటువంటి అనుమతులు లేకుండా, విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో దండుకుంటున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు ఇచ్చే మామూలు మత్తులో ఊగుతున్నారన్నారు. కనీసం జిల్లా కలెక్టర్ అయిన స్పందించి జిల్లాలో అనుమతులేని కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థల పైన చర్యలు తీసుకోవాలని కోరారు ఈ ధర్నాలో వివిధ సంఘాల నేతలు సతీష్ చౌదరి, జయవర్ధన్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, రాజేష్, విజయ్, పోలా నరేష్, ప్రశాంత్, వాల్మీకి కాశి, గోవర్ధన్, యశ్వంత్, రేవంత్ తదితర విద్యార్థి నేతలు పాల్గొన్నారు..

## కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, 22వ వార్డు ఇన్‌చార్జ్ తుమ్మల అర్బాజ్‌కు సూర్య చారిటబుల్ ట్రస్ట్ కృతజ్ఞతలు



**అంకుశం న్యూస్, కదిరి, జూలై:7:** శ్రీ సత్యసాయి జిల్లా, అమ్మడుగూరు మండలం, మహ్మదాబాద్‌లోని, సూర్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రయం పొందుతున్న కర్ణాటకకు చెందిన వృద్ధురాలు గంగులమ్మకు చికిత్స అందించడంలో సహకరించిన కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్,టీడీపీ పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, 22వ వార్డు ఇన్‌చార్జ్ తుమ్మల అర్బాజ్‌లకు ట్రస్ట్ యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.ట్రస్ట్ అధినేత లక్ష్మీదేవమ్మ తెలిపిన వివరాల ప్రకారం, సుమారు 11 నెలల క్రితం గంగులమ్మను కొందరు ఆశ్రమంలో వదిలి వెళ్లగా,అప్పటి నుంచి ట్రస్ట్‌లో ఆమెకు ఆశ్రయం,ఆహారం, సంరక్షణ అందిస్తూ వస్తున్నారు.ఆశ్రమంలో చేరిన తర్వాత ఆమె ఆరోగ్యంగా,సంతోషంగా జీవించారు.అయితే ఇటీవల కాలుజారి పడిపోవడంతో గంగులమ్మను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.వైద్యులు శస్త్రచికిత్స అవసరమని, అందుకోసం రక్త సంబంధీకుల సమ్మతి అవసరమని తెలిపారు.ట్రస్ట్ యాజమాన్యం బంధువులకు సమాచారం అందించినప్పటికీ, వారు రావడానికి నిరాకరించినట్లు వెల్లడించారు.ఈ విషయం తెలుసుకున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ వెంటనే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా,ఎమ్మెల్యే వెంటనే స్పందించి వైద్యులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 22వ వార్డు ఇన్‌చార్జ్ తుమ్మల అర్బాజ్ చొరవ తీసుకుని గంగులమ్మ బంధువుల్లో ఒకరైన చలపతిని ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్యులతో మాట్లాడి అవసరమైన ప్రక్రియ పూర్తి చేయించారు.దీంతో సోమవారం గంగులమ్మకు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు.ఈ సందర్భంగా సూర్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ,మానవత్వంతో స్పందించి గంగులమ్మకు శస్త్రచికిత్స జరిగేలా సహకరించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్,టీడీపీ పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్,22వ వార్డు ఇన్‌చార్జ్ తుమ్మల అర్బాజ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఈ కార్యక్రమంలో సహకరించిన జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి ఖాసిం,ఎస్సీ సెల్ నాయకులు పిచ్చిలి శంకరంలకు కూడా ట్రస్ట్ యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.

# ఎస్ఐఆర్ పై అనవసర అపోహలు వద్దు

## రాజకీయాలకు ఎటువంటి సంబంధం లేదన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్





**అంకుశం న్యూస్ అనంతపురం జూలై 7** ఎస్ఐఆర్ పై కొందరు అనవసర అపోహలు సృష్టిస్తున్నారని.. తమకు ఓటు హక్కు పోతుందని ప్రజలు ఆందోళన చెందవద్దని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. నగరంలోని పలు ప్రాంతాలలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పర్యటించారు. నగరంలోని మారుతి నగర్, అశోక్ నగర్, బుడ్డప్ప నగర్, సంగమేష్ నగర్, ఎర్ర నేల కొట్టాల ప్రాంతాలలో పర్యటించి, ఎస్ఐఆర్ పై బిఎల్ఓలు, బిఎల్ఏ లతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు కొన్ని సందేహాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ గత నెల రోజులుగా ఎస్ఐఆర్ కి సంబంధించిన ఎన్యుమరేషన్ ఫార్మ్స్ ప్రజలకు అందజేశారని... వాటిలో పూర్తిస్థాయి వివరాలతో తిరిగి బీఎల్ఓ లకు ఇవ్వాలని సూచించారు. అయితే కొంతమందికి దీనిపై అవగాహన లేక ఆందోళన చెందుతున్నారన్నారు. ఇది పూర్తిగా ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతోందన్నారు. రాజకీయాలకు ఎక్కడా సంబంధం లేదన్నారు. తమ ఓటు హక్కు విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. 2002 ప్రామాణికంగా ఎస్ఐఆర్ కార్యక్రమం జరుగుతోందన్నారు. అప్పటి వివరాలు లేకపోతే ప్రభుత్వం నిర్దేశించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏవైనా రెండు చూపితే సరిపోతుందని చెప్పారు. వృద్ధులు, చదువు రాని వారికి మా పార్టీ బిఎల్ఏలు సహకరిస్తున్నారని చెప్పారు. కొత్తగా ఓటు హక్కు పొందాలనుకునే వారికి కూడా ఇది మంచి అవకాశం అన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ గత నెల రోజులుగా ఈ కార్యక్రమం పై సీరియస్ గా పని చేస్తున్నారని ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పర్యవేక్షిస్తున్నారన్నారు. ఎక్కడైనా ఇది పురోగతి లేకపోతే అప్రమత్తం చేస్తున్నారని వివరించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం 100% పూర్తయ్యేలా ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు, తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, క్లస్టర్ ఇంచార్జ్ లు సరిపూటి రమణ, రాజారావు, సాకే లక్ష్మీనరసింహ, కృష్ణం రఘు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి నాయుడు, టిడిపి నాయకులు జోగి రాజేంద్ర, సరిపూటి శ్రీకాంత్, ఇమ్రాన్, పుల్లన్న, సరోజమ్మ, యమున, కట్టుబడి బాబాజీ పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ దరఖాస్తులు వెంటనే సమర్పించాలి

**గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో**
**జిల్లా కలెక్టర్ సమావేశం**
**జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**





**అంకుశం న్యూస్అనంతపురం, జూలై 7:** అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం ఎస్ ఐ ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియ వివరాలనుసమావేశంలో తెలియజేశారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాలలో బిఎల్ఏ లనుఎక్కువమంది నినియమించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా అందించిన ఎన్యుమరేషన్ దరఖాస్తులను పూర్తి చేసి ఈనెల 14 లోగా గడువు ముగుస్తున్నందున ఆయా బూత్ లెవెల్ అధికారులకు అందజేయాలని ఓటర్లను జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నా మని అన్ని ప్రాంతాలలో బి ఎల్ ఓ, అధికారులు ఇంటింటికి వెళ్లి వంద శాతంఓటర్లకు దరఖాస్తులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బిఎల్వోలు ఇళ్లకు వచ్చినప్పుడు ఓటర్లు సరైన వివరాలు అందించి సహక రించాలని కోరారు అలాగే ఓటర్ల జాబితా పారదర్శకత కోసం రాజకీయ పార్టీలు కూడా తమ బిఎల్ ద్వారా ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 59. 85% ఎస్ఐఆర్ ప్రక్రియ పనులు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. మిగిలినప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

జిల్లాలో సుమారు 20 ,38,
5 2 7 ఓటర్లకు గాను నేటి మధ్యాహ్నం 12 గంటల వరకు 12 ,22, 0 0 6 9 మంది కి దాకా డిజిటలేషన్ ప్రక్రియ నమోదు జరిగిందన్నారు.
ప్రతిరోజు సుమారు 1,20,000 వేల మందికి దాకా డిజిటలైజేషన్ జరుగు
తుందని రాబోయే శని, ఆదివారాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఇంటింటకీ వెళ్లి ఓటర్ల వద్దనుండి విషయ సేకరణఫారాలనుస్వీకరించడం జరుగుతుందన్నారు.
80 శాతం పూర్తయిన బిఎల్వోలు సంబంధిత బి ఎల్ ఎ లతో సమావేశం చేసుకొనివారిసమన్వయంతో
ఇప్పటివరకుస్వీకరించబడని
ఫారాలను త్వరగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా 2022 ఓటర్లు జాబితా వివరాలు తప్పనిసరి కాదని ఓటరుప్రస్తుతంఉన్నవివరాలు వ్రాసి ఆయా బిఎల్ఓ లకు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గడువులోగా ఫారాలు సమర్పించనియెడల ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

అనంతపురం అర్బన్ లో 45. 22 శాతం, కళ్యాణ్ దుర్గం 67. 37, రాయదుర్గం 65. 53, గుంత కల్ 65. 36, తాడిపత్రి 60 .62, ఉరవకొండ 58. 69, సింగనమల 58. 60, రాప్తాడు 58. 85 కాగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 59.85% డిజిటల్ ప్రక్రియ జరిగిందన్నారు.
నిర్ణీత గడువు సమీపి
స్తున్నందున ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.
అంతకుముందు గుర్తింపు పొందిన వివిధ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను 100% పూర్తిచేసే విధంగా తమ వంతు సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.
ఈ సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తాసిల్దార్ కనకరాజు, శ్యాముల్ బెంజిమెన్, తెలుగుదేశం ప్రతినిధి నారాయణస్వామి బిజెపి పరిధినిది ఈశ్వర్ ప్రసాద్ జనసేన పార్టీ ప్రతినిధి కిరణ్ కుమార్ వైయస్సార్సీపీ ప్రతినిధి సోమశేఖర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధి ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

## దగ్గుబాటి ఎమ్మెల్యే నీ కలిసినత్రీ టౌన్ నూతన సీఐ కాలుట్లయ్య



**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం జూలై 7** అనంతపురం నగరంలో శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేయాలని త్రీ టౌన్ నూతన సీఐ కౌలుట్లయ్యకు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను సీఐ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురం నగరంలోని శాంతిభద్రతల పరిస్థితి, ప్రజల భద్రత, నేరాల నియంత్రణ ఇతర అంశాల్లో మెరుగైన సేవలు అందించేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ, ప్రజలకు భద్రత కల్పించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని.. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సమర్థవంతమైన పోలీసింగ్ నడుస్తోందని... ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా విధులు నిర్వహించాలని సీఐ కాలుట్లయ్యకు ఎమ్మెల్యే సూచించారు.

## ఈ ఇరుకు వంతెన కి మోక్షం ఎప్పుడో



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూలై 07:** అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి వెళ్ళే వంతెన ప్రమాద భరితంగా మారింది. నిత్యం వేలాదిమంది ప్రయాణికులతో రద్దీగా ఉండే పందలపాక మసీదు దగ్గర వంతెన పరిస్థితి ప్రమాదం కరంగా ఉందని ఆ ఊరి ప్రజలుభయభ్రాంతులకు గురౌతున్నారు. ఎందుకంటే కొమరిపాలెం తొస్సిపూడి వైపు నుండి వచ్చే వాహనాలు కొంకుదురు వైపు ఇటు ఊలపల్లి,జి.మామిడాడ వైపుకు మూడువైపులు నుండి నిత్యం ప్రయాణాలు సాగుతుండడమే కాకుండా కాలువకి అవతలివైపు స్కూల్ ఉండటం చదువు కోవడం కోసం నిత్యం పందలపాక వైపు నుండి ఇదే వంతెన మీదుగా ఎదురుగా ఉన్న చిన్న వంతెన ఎక్కి ఎందరో విద్యార్థినీ విద్యార్థులు రావడం ఇరుకు వంతెనపై ప్రయాణాలు చేసేటప్పుడు ఏదైనా భారీ వాహనం వస్తే తప్పించుకొనే అవకాశం లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కనీసం ఈ వంతెనకు రైలింగ్ కూడా లేకపోవడంవల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయం పై అధికారులకు ఎన్నిసార్లు పిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలవలోకి పడబోయిన లారీని చూసైనా సంబంధిత అధికారులు పట్టించుకుంటారేమో చూడాలి.


## ఘనంగా ధర్మవరం లో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పుట్టిన రోజు వేడుకలు.!



**అంకుశం న్యూస్ ధర్మవరం జూలై 7** ధర్మవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ (సూరి) జన్మదిన వేడుకలు అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రియాంక నగర్ సూరి వ్యక్తిగత కార్యాలయం వద్ద అన్న అభిమానులు, కార్యకర్తలు మధ్య కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఆ తరువాత పట్టణంలోని షిర్డీ సాయిబాబ , శివాలయంలో మాజీ ఎమ్మెల్యే సూరిపేరు మీద అర్చన, పూజలు నిర్వహించారు. అలాగే గొట్లూరు గ్రామం దగ్గర వున్న అనాథ ఆశ్రమం లో వృద్ధులకు బియ్యం ప్యాకెట్ ఇస్తూ, అన్నదానం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలుకుంట్ల అప్పస్వామి, ఓబులనాయునిపల్లి పెద్దాయప్ప,బిల్వంపల్లి నారాయణస్వామి, రామకృష్ణ, దర్శినమల నాగరాజు, బొడిగల గిరిదర్ ,కట్టుబడి వీరన్న, నారాయణస్వామి యాదవ్, రేగాటిపల్లి సూర్యనారాయణ రెడ్డి,రాప్తాటిరాము, సుదర్శన్ రెడ్డి, లింగుట్ల రామాంజి, సాహేబ్బి,సుజాతమ్మ, అరుణ,పద్మావతమ్మ,గోపాలకృష్ణ,పూజారి మల్లికార్జున, మల్లాకాలువ రాముడు, చౌదరి, ఓలేటి మురళి, మలకాపురం చల్లా హరి, బాల, బాబయ్య,సూరి,ఈశ్వరరెడ్డి, గంధమనేని నారాయణస్వామి ,పోతుకుంట మధు,రామకృష్ణ, శ్రీనివాసులు, లింగుట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలలో నిజాయితీగా మాట్లాటడమే పవన్ కళ్యాణ్ తప్పా ?

**సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్**



**అంకుశం న్యూస్ విజయవాడజులై 7** రాష్ట్రంలోప్రస్తుత రాజకీయాలలో నిజాయితీగా మాట్లాడటమే పవన్ కళ్యాణ్ చేసిన తప్పా అని సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఒక ప్రకటన చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమ పడుతున్న డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై రాజకీయ పరంగానే కాకుండా, వ్యక్తిగత వ్యవహారాలలో కూడా జోక్యం చేసుకొని విమర్శలు చేయటం పట్ల శ్రీనివాస్ కుమార్ ఖండించారు. అధికారంలో ఉన్న, లేకున్నా పవన్ కళ్యాణ్ తనకున్న రాజకీయ అవగాహనతో పక్షపాతం లేకుండా స్థిర చిత్తంతో నిజాయితీగా మాట్లాడటం ఆయన చేసిన నేరమా అని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడే పవన్ కళ్యాణ్ ని చూసి ఓర్వలేకనే ఇటువంటి తప్పుడు ఆరోపణలతో ఆయనను అప్రతిష్ట పాలు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ విమర్శలే కాకుండా పవన్ కళ్యాణ్ కుటుంబాన్ని సైతం వదలకుండా దిగజారుడు ఆరోపణలు చేయటం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయాలకు వ్యక్తిగత జీవితాలకు ఎటువంటి సంబంధం లేదన్న సంగతి రాజకీయ జ్ఞానం ఉన్న ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే . అయితే ఆయనను మానసికంగా దెబ్బతీసేందుకు చాలామంది కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. రాజకీయ దివాళా కోరులు ఇకనైనా నీచ సంస్కృతికి స్వస్తి పలకాలని హితవు పలికారు . ప్రజల కోసం ఆయన పడుతున్న శ్రమను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు విడపనకల్లో జరిగే వైఎస్ఆర్ జయంతి జయప్రదం చేద్దాం

**ఎంపీపీ కరణం పుష్పావతి భీమిరెడ్డి పిలుపు**

**అంకుశం న్యూస్ విడపనకల్ జూలై 7 :** విడపనకల్ మండల కేంద్రంలో నేడు ఉదయం 9:30 గంటలకు బస్టాండ్ వద్ద ఉన్న వైయస్సార్ కూడలి వద్ద నిర్వహించనున్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి కార్యక్రమాన్ని పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విడపనకల్ మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు కరణం పుష్పావతి భీమిరెడ్డి పిలుపునిచ్చారు.వైఎస్ఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత అని,ఆయన ఆశయాలు,సంక్షేమ పాలన నేటికీ ప్రజలకు ఆదర్శమని పేర్కొన్నారు.ఆయనకు ఘన నివాళులర్పించే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కరణం భీమిరెడ్డి,భరత్ రెడ్డి,మండల కన్వీనర్ కురుబ.రమేష్,మండల ఉపాధ్యక్షుడు బోయ నాగేంద్ర,బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గిరిబాబు,ఎస్సీ సెల్ నాయకులు సుంకన్నతో పాటు పలువురు పార్టీ నాయకులు,కార్యకర్తలు పిలుపునిచ్చారు.

## లాయర్లు నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 07:** అనపర్తిలో శాశ్వత కోర్టు భవనం తో పాటు ఇంతకు ముందు హామీ ఇచ్చినట్టుగా బార్ అసోసియేషన్ కి మంచి గది కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు అందరికీ పరిరక్షణ బిల్లును ప్రవేశపెట్టి చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు రూ.10 వేలు స్టైఫండ్ మంజూరు చేయాలని, న్యాయవాదులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అనపర్తి బార్ అసోసియేషన్ సభ్యులు చేపట్టిన ఒకరోజు నిరాహార దీక్షకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సంఘీభావం తెలిపారు. న్యాయవాదుల డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బార్ అసోసియేషన్ సభ్యులకు తెలిపారు.

# విజయవాడ అంబేద్కర్ కళావేదికలో ఏపీ హస్త కళా మహోత్సవం




డిప్యూటీ సీఎం పవన్ తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కేశినేని చిన్ని

**అంకుశం ప్రతినిధివిజయవాడ జులై 7** విజయవాడ అంబేద్కర్ కళా వేదికలో ఏపీ హస్తకళ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొని ప్రారంభించారు. డిప్యూటీ సీఎం పవన్ కు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని స్వాగతం పలికి పవన్ కళ్యాణ్ తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసినటువంటి స్టాల్స్ అన్నిటిని డిప్యూటీ సీఎం పవన్ మరియు మంత్రి సవిత, ఎంపీ కేశినేని చిన్ని, ఆంధ్రప్రదేశ్ హస్తకళ నైపుణ్య అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, పలువురు ఉన్నతాధికారులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని చిన్ని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న లేపాక్షి హస్తకళ మహోత్సవం హస్తకళ ఎక్స్పో అత్యంత వైభవంగా ప్రారంభోత్సవం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదగా ప్రారంభించుకోవడం మంచి పరిణామం అని తెలిపారు లేపాక్షి అనేది ఒక సంస్థ మాత్రమే కాదు అది ఆంధ్రప్రదేశ్ హస్తకళల వారసత్వం సంస్కృతి సాంప్రదాయం కళాకారుల సృజనాత్మక ప్రతీకాని ఎంపీ చిన్ని తెలిపారు రాష్ట్రంలో వేలాదిమంది హస్తకళాకారుల జీవనోపాధికి బలమైన ఆధారంగా నిలుస్తున్న లేపాక్షిని ప్రపంచ స్థాయిలో మరింత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి లక్ష్యమని అన్నారు సంప్రదాయ హస్తకళలను పరిరక్షిస్తూనే ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వాటిని ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించేందుకు అన్ని రకాల చర్యలు ఈ కూటమి ప్రభుత్వం చేపడుతుందని స్పష్టం చేశారు ఆంధ్రప్రదేశ్ హస్తకళలు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం లేపాక్షి బ్రాండ్ మరింత బలోపేతం చేయడం ఈ కామర్స్ వేదికల ద్వారా విక్రయాలు విస్తరించడం లక్ష్యంగా కార్యచరణ కొనసాగుతుందని తెలియజేశారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హస్తకళలను కళాకారులను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా వారికి ప్రోత్సాహం అందించేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు భవిష్యత్తులో కళాకారులకు ఇంకా మెరుగైన సేవలు అందించే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీ చిన్ని తెలియజేశారు. కొండపల్లి హస్తకళల భౌగోళిక గుర్తింపును కాపాడుతూ నకిలీల నివారణ మరియు అంతర్జాతీయ మార్కెటింగ్ కు అణువుగా వీటికి పార్లమెంట్ వేదికగా చర్చించి జియో టాకింగ్ సౌకర్యాన్ని సైతం తీసుకురావడం జరిగిందని ఎంపీ చిన్ని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి సవిత ఎంపీ కేశినేని చిన్ని , ఆంధ్రప్రదేశ్ హస్తకళ నైపుణ్య అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పలువురు ఐఏఎస్ లు, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# చంద్రబాబు పాలనలోసంక్షోభంలో వ్యవసాయం రంగం

చంద్రబాబు సీఎం అయ్యాక జిల్లాలో 75 మంది రైతుల ఆత్మహత్యలు

రైతాంగ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు

వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



**అంకుశం న్యూస్అనంతపురం, జూలై 07 :** రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని వైఎస్ఆర్సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదుకునేవారు లేక రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి పెద్ద పీట వేస్తాం.. రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటాం.. విత్తనాలు, ఎరువులు అందిస్తాం అని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితి లేదన్నారు. ఇంకా అనంత వెంకటరామిరెడ్డి ఏమన్నారంటే..“రెండేళ్లుగా అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు దెబ్బతిన్నాయి. వైఎస్ జగన్ హయాంలో ఎప్పటికప్పుడు ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందేది. కానీ రెండేళ్లుగా ఈ ప్రభుత్వం ఇవ్వలేదు. కరువు మండలాలుగా ప్రకటించినా, పంటలు దెబ్బతిన్నా బీమా రూపంలో ఆర్థికసాయం ఇవ్వలేదు. వైఎస్ జగన్ హయాంలో ఉచిత పంటల బీమా అమలు చేస్తే ఈ ప్రభుత్వం మంగళం పాడింది. కూటమి అధికారంలోకి వచ్చాక రైతులతో ప్రీమియం కట్టించుకున్నా ఇన్సూరెన్స్ ఇవ్వలేదు. అనంతపురం జిల్లాలో రెండేళ్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు రూ.120 కోట్లు ఇన్పుట్ సబ్సిడీ పెండింగ్లో ఉంది. ఇన్సూరెన్స్ కూడా అదిగో..ఇదిగో అంటున్నా రైతులకు ఒక్క రూపాయి అందలేదు. అదే వైఎస్ జగన్ హయాంలో ఐదేళ్లలో రూ.1160 కోట్లు పంటల బీమా అందజేశాం. రూ.436 కోట్లు ఇన్పుట్ సబ్సిడీ అందజేశాం. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నా దాన్ని సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలో ప్రభుత్వానికి ముందుచూపు లేకుండాపోయింది. కార్తెలు ముగుస్తున్నా రైతులను పట్టించుకునే నాథులు కరువయ్యారు. అనంతపురం జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 8 లక్షల 65 వేల ఎకరాలుంటే ఇప్పటి వరకు కేవలం 1 లక్షా 38 వేల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. సాధారణ సాగులో సగం వేరుశనగ పంటను పెడతారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో లక్ష నుంచి 1.50 లక్షల క్వింటాళ్లు విత్తన వేరుశనగ సబ్సిడీతో అందిస్తే ఈ ప్రభుత్వం వచ్చాక కుదించారు. ఈ ఖరీఫ్లో 56 వేల క్వింటాళ్లు అందిస్తామని చెప్పి 25 వేల క్వింటాళ్లు కూడా అందించలేదు. సరఫరా చేసిన వాటిలో కూడా నాసిరకం ఉన్నాయి. మరోవైపు ఎరువుల ధరలు పెరిగాయి. రూ.150 నుంచి రూ.200 అధిక ధరకు యూరియా అమ్ముతున్నారు. దీని వల్ల చిన్న, సన్నకారు రైతులపై ఆర్థికభారం పడుతోంది. గతంలో 3 వేల క్వింటాళ్ల వరకు కందులు సరఫరా చేస్తే నేడు 1200 క్వింటాళ్లు మాత్రమే సరఫరా అయ్యింది. వేరుశనగ గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పటి వరకు కేవలం 6.7 శాతం మాత్రమే సాగు అయ్యింది. అధికారిక లెక్కల ప్రకారమే జిల్లాలో 7 లక్షల 10 వేల ఎకరాలు బీడుగా ఉంది. మరోవైపు తుంగభద్ర జలాల ఆధారంగా రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో నార్లు వేసుకున్న రైతుల పరిస్థితి అయోమయంగా ఉంది. ఇలాంటి కష్టకాలంలో ప్రజాప్రతినిధులు మాటలకు, రాజకీయాలకే పరిమితం అవుతున్నారు. రైతులను ఆదుకునే విషయంలో చొరవ చూపడం లేదు. మరోవైపు సాగు చేసిన పంటలు కూడా వాడు ముఖం పడుతున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అటు సాగు, ఇటు తాగునీటి పరిస్థితులపై ప్రజాప్రతినిధులకు చీమకుట్టినట్టు కూడా లేదు. ప్రతిపక్ష పార్టీలు గొంతెత్తుతున్నా.. పత్రికల్లో కథనాలు వస్తున్నా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఎల్నినో ప్రభావంతో వర్షాలు రాని పరిస్థితులు ఉన్నాయి. గతంలో పంటల బీమాకు సంబంధించి క్రాప్లోన్ తీసుకునే సమయంలోనే రైతుల వాటాను ప్రభుత్వం చెల్లించేది. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక ఉచిత పంటల బీమాకు మంగళం పాడింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్కు సంబంధించి పంటల బీమా నోటిఫికేషన్ను సోమవారం విడుదల చేశారు. వాతావరణ బీమాకు జూలై 15వ తేదీ.. అంటే మరో ఏడు రోజులు మాత్రమే గడువు పెట్టారు. అసలు ఎకరాకు ఎంత కట్టాలో కూడా తెలియని పరిస్థితి. ఈ సమయంలో లక్షలాది మంది రైతులు తమ ప్రీమియం వాటాను కట్టడానికి బ్యాంకుల చుట్టూ తిరగాలి. ప్రస్తుతం రైతులు ప్రీమియం కట్టుకోలేరు. ప్రభుత్వమే బీమా ప్రీమియం కట్టి రైతులకు మానసిక ధైర్యం ఇవ్వాలి. రెండేళ్లుగా రైతులను ఆదుకునే వారు కరువయ్యారు. భార్యాపిల్లలను పోషించుకోలేక.. పంట సాగు కోసం చేసిన అప్పు తీర్చే మార్గం లేక రెండేళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 160 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.లేనిపక్షంలో రైతాంగం, రైతు కూలీల తరపున కలిసొచ్చే పార్టీలతో పోరాటం చేస్తాం” అని అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో వైసీపీ నేతలు నరసింహులు, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వెన్నం శివారెడ్డి పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.. ఓ ఆనంద్




- : గార్లదిన్నె మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద, కల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎస్ఐఆర్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్..
- : వేగంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను చేపట్టాలి
- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

**అంకుశం న్యూస్అనంతపురం, జూలై 07 :** క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తనిఖీ చేశారు. మంగళవారం ముందుగా గార్లదిన్నె మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద పోలింగ్ కేంద్రాలు 42 నుంచి 49 పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు గార్లదిన్నె మండలంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)ను తనిఖీ చేసి పర్యవేక్షణ చేయడం జరిగిందన్నారు. ఎస్.ఐ.ఆర్ లో చివరి కొన్ని రోజులు ఉన్నాయని, జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారుగా 60 శాతం దాకా ఈ ప్రక్రియను పూర్తి చేయగలిగామని, మిగిలిన 40 శాతం మంది ఎవరైతే ఉన్నారో రాబోయే రెండు మూడు రోజుల్లో వీలైనంత వరకు త్వరలోనే ఈ ఎన్యుమరేషన్ ఫారాలను వెనక్కి ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఎస్.ఐ.ఆర్ కింద ఎన్యుమరేషన్ ఫారాలను ఇచ్చినప్పుడు ఆ ఎన్యుమరేషన్ ఫారాలను ఫిల్ చేసి ఇస్తే చాలు అని, దాంతో పాటు డాక్యుమెంట్లుగాని, 2022 ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ గాని, అవేమీ తప్పనిసరి కాదని, మీ దగ్గర ఇన్ఫర్మేషన్ ఉంటే ఇవ్వండి, లేని పరిస్థితుల్లో అయితే మాత్రం దయచేసి ఆ ఎన్యుమరేషన్ ఫారాలను కనీసం ఫిల్ చేసైనా మీ బి.ఎల్.ఓకి అందించేటట్టు చూడాలన్నారు. బి.ఎల్.ఓలు కూడా మీ ఇంటింటికి వస్తారు, అదే కాకుండా ప్రతి ఒక్క పొలిటికల్ పార్టీ వారు వస్తారని, ప్రతి ఒక్కరూ ఎన్యుమరేషన్ ఫారాలను ఫిల్ చేసి ఇవ్వాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్ ద్వారా ప్రతిరోజూ కనీసం 50 మంది ఓటర్ల వివరాలను సేకరించవచ్చన్నారు. దయచేసి బూత్ లెవల్ ఏజెంట్లను సంప్రదించి, ఎన్యుమరేషన్ ఫారాలను నింపమని కోరుతున్నామన్నారు. ఒకవేళ మీరు ఆ ఫారమ్లను నింపలేకపోతే, ఆ ఓట్లు ఓటరు జాబితా నుండి తొలగించబడతాయని, ఖచ్చితంగా ఈఎఫ్ ఫారమ్లను నింపాలన్నారు. ఒకవేళ 2002 ఓటర్ల జాబితాకు సంబంధించిన మ్యాపింగ్ లేదా సరైన పత్రాలు లేకపోయినా, కనీసం ఈఎఫ్ ఫారమ్ను నింపాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఎన్ని ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు, ఎన్ని తిరిగి తీసుకుని అప్లోడ్ చేశారు అంటూ బిఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. పలువురు బిఎల్ఏలు, ఓటర్లతో మాట్లాడి ఎస్ఐఆర్ లో సమస్యలను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం గార్లదిన్నె మండలంలోని కల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పోలింగ్ కేంద్రం 18 పరిధిలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. బిఎల్ఓలు, బిఎల్ఏలు, ఓటర్లతో మాట్లాడారు. నిర్ణీత గడువులోపు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఈరమ్మ, ఇంచార్జి ఎంపిడిఓ బాబా ఫక్రుద్దీన్, బిఎల్ఓలు షహనాజ్ బేగం, ప్రతిభ, రాజేంద్ర, బిఎల్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

## గోరంట్ల సచివాలయంలో ఎస్ఐఆర్ నమోదు ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్



**అంకుశం న్యూస్ పుట్టపర్తి జూలై 7:** గోరంట్ల సచివాలయంలో మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎ. శ్యామ్ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గోరంట్ల మండలానికి సంబంధించిన పోలింగ్ కేంద్రాల ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ జరుగుతున్న తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సచివాలయంలోని కంప్యూటర్ సిస్టమ్స్లో సిబ్బంది నమోదు చేస్తున్న డేటా ఎంట్రీ ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి, వారికి పలు కీలక సూచనలు చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి చిన్నపాటి తప్పులు దొర్లకుండా, అత్యంత జాగ్రత్తగా, ఖచ్చితత్వంతో డేటా ఎంట్రీ చేయాలి. ఎన్నికల విభాగానికి సంబంధించిన ఈ ప్రక్రియను నిర్దేశించిన కాలపరిమితి లోగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన మార్గదర్శకత్వం వహించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గోరంట్ల తహాసిల్దార్ మధు నాయక్,ఎంపీడిఓ తోపాటు స్థానిక ఎన్నికల విభాగపు సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ సమావేశాలు నిర్వహించాలి

ఎస్ఐఆర్ విషయంలో మరింత చురుగ్గా పనిచేయాలని సూచన



**అంకుశం న్యూస్ అనంతపురం జూలై 7** రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని 6మండలాల్లోని 59మంది యూనిట్ ఇన్ ఛార్జ్ లు తప్పనిసరిగా సమావేశాలు నిర్వహించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి రేపు బుధవారం యూనిట్ ఇన్ ఛార్జ్ ల సమావేశం నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయని.. ఆ మేరకు నియోజకవర్గ పరిధిలోని 59యూనిట్లలోనూ సమావేశాలు జరగాలన్నారు. పార్టీ నేతలు కార్యకర్తలతో పాటు స్థానిక ప్రజలను కలుపుకొని సమావేశాలు నిర్వహించి.. మీ పోలింగ్ బూత్, గ్రామ, యూనిట్ స్థాయిలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయాలి, సమస్యలు ఏమైనా ఉన్నాయా? వంటి వాటి మీద చర్చించాలన్నారు. అలాగే పనులు చేపట్టాల్సిన అంశాలపై తీర్మానాలు చేసి మై టిడిపి యాప్ లో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎస్ఐఆర్ కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు. బీఎల్ఏలు ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫామ్ లు బిఎల్ఓలకు అందజేసేలా చూడాలన్నారు. కొన్నిచోట్ల అవగాహన లేక ప్రజలు వీటికి దూరంగా ఉంటున్నారని.. అయితే ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత మన పార్టీపై ఉందని ఎమ్మెల్యే సునీత అన్నారు. మరోసారి బిఎల్ఏలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ కార్యక్రమం గురించి అవగాహన కల్పించాలన్నారు. క్లస్టర్, మండల ఇన్ ఛార్జ్ లు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు....

## 33వ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు సమావేశంలో పాల్గొన్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 07:** విజయవాడ లో నిర్వహించిన 33వ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాణ కార్మికుల సంక్షేమం, వెల్ఫేర్ బోర్డు ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు, కార్మికులకు మరింత పారదర్శకంగా మరియు వేగంగా సేవలు అందించే అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణ కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా అందించే అన్ని పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి నిర్మాణ కార్మికుడికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్మికుల నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేయడంతో పాటు, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్మికుల భద్రత, సామాజిక భద్రత, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంవీ శేషగిరిబాబు, కమిషనర్ గంధం చంద్రుడు, బోర్డు సభ్యులు,కార్మిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## రక్షిత మంచినీటి సరఫరా ట్యాంక్ నిర్మాణస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ళ




**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 07:** మండపేట పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రక్షిత మంచినీటి సరఫరా పథక పనులకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం మండపేట పట్టణ వాటర్ వర్క్స్ ఆవరణలో నూతనంగా నిర్మించ తలపెట్టిన రక్షిత మంచినీటి సరఫరా శంకుస్థాపన స్థలాన్ని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. పట్టణ ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలుపోటి సత్యనారాయణ (బాబు), పాలచర్ల శిరీష్, పబ్లిక్ హెల్త్ డి.ఇ విజయ పార్వతి, ఎ.ఇ సంధీప్, మున్సిపల్ డి.ఇ శ్రీనివాస్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.